క్లుప్తంగా

మహిళలు రుణాలు సద్వినియోగం చేసుకోవాలి

దహెగాం: స్వయం సహాయక సంఘాల్లో ఉన్న సభ్యులు ప్రభుత్వం నుంచి వచ్చే రుణాలను సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్ నవీన్‌కుమార్, ఐకేపీ ఏపీఎం చంద్రకిరణ్‌లు అన్నారు. సోమవారం మండలంలోని పెసరికుంట, బీబ్రా గ్రామాల్లోని మహిళా సంఘాల సభ్యులకు పీఎంఎఫ్‌ఎంఈ పథకంలో భాగంగా మంజూరైన రెండు యూనిట్ల పిండి గిర్నిలను ప్రారంభించారు. ఐకేపీ సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

శాంతియుతంగా జాతర నిర్వహించాలి

కౌటాల: తాటిపల్లి మహాశివరాత్రి మహా జాతరను శాంతియుతంగా నిర్వహించాలని ఎస్సై ఎస్.మధుకర్ అన్నారు. సోమవారం తాటిపల్లి గ్రామ సమీపంలోని వార్ధా నది ఒడ్డున గల శ్రీ సిద్ధి హనుమాన్ ఆలయంలో చేపడుతున్న జాతర ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మహాశివరాత్రి సందర్భంగా నిర్వహించే జాతర రోజు ఆలయంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని తెలిపారు. సమీప నదిలో భక్తులు లోతుగా ఉండే ప్రాంతాలకు వెళ్లకుండా తగిన సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలని సూచించారు. ఆలయ కమిటీ చైర్మన్ ఎల్ములే దత్తు, ఆలయ పూజారి నారాయణ్ పటేల్, కమిటీ సభ్యులు మారుతి, సంజయ్, ప్రవీణ్, తిరుపతి, వాసుదేవ్, చంపత్, తదితరులు ఉన్నారు.

వైద్య శిబిరానికి స్పందన

కౌటాల: మండల కేంద్రంలోని ఇన్‌ఫంట్ జీసస్ పాఠశాలలో సోమవారం కౌటాల విజేత ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు డా. విద్యాసాగర్, డా. రఘు ప్రసాద్, డా. కీర్తినాయుడు రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందించారు. కార్యక్రమంలో ఫాదర్ టోమ్, సిబ్బంది సతీశ్, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో ఎద్దు మృతి

కౌటాల: మండలంలోని కన్నెపల్లి గ్రామానికి చెందిన రైతు లెండుగురె పోచయ్యకు చెందిన ఎద్దు సోమవారం రాత్రి విద్యుత్‌షాక్‌తో మృతి చెందింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామ శివారులోని తిరుపతి పొలం వద్ద ఏర్పాటు చేసిన సోలార్ షాక్ తగిలి ఎద్దు అక్కడికక్కడే మృతి చెందిందన్నారు. ఎద్దు విలువ రూ.40 వేలు ఉంటుందని, ప్రభుత్వం పరిహారం అందించాలని రైతు కోరారు.

మున్నూరుకాపు ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

ఆసిఫాబాద్‌అర్బన్: మున్నూరుకాపు సంఘం ఫైనాన్స్ కార్పొరేషన్‌ను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఏర్పాటు చేయాలని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య పటేల్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో మున్నూరు కాపులు అధిక సంఖ్యలో ఉన్నారని, అన్ని రంగాల్లో చాలా వెనుకబడి ఉన్నారన్నారు. మున్నూరుకాపుల అభివృద్ధికి ప్రభుత్వం రూ.5వేల కోట్లతో ఫైనాన్స్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సంజీవ్, సతీశ్, వెంకన్న, సురేశ్, శంకరమ్మ, తిరుపతి, గోపాల్, జక్కయ్య, సదాశివ పాల్గొన్నారు.

6న వాహనాల వేలం

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో వివిధ కేసుల్లో అక్రమ రావాణాలో స్వాధీనం చేసుకున్న వాహనాల వేలం నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారి జ్యోతి కిరణ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు ఈ నెల 6న వేలంలో పాల్గొనాలని పేర్కొన్నారు.

గంగాపూర్ రైల్వే గేటు మూసివేత

రెబ్బెన: మండల కేంద్రంలోని గంగాపూర్, నంబాల గ్రామాలకు వెళ్లే దారిలో ఉన్న రైల్వే గేట్ (గంగాపూర్ రైల్వే గేటు)ను మంగళవారం నుంచి మూడు రోజుల పాటు మూసివేయనున్నట్లు రైల్వే అధికారులు ప్రకటించారు. కొత్తగా నిర్మిస్తున్న మూడవ లైన్ నిర్మాణ పనుల్లో భాగంగా గేట్‌ను తాత్కాలికంగా మూసివేస్తున్నట్లు తెలిపారు. ట్రాకుకు అవతలి వైపు ఉన్న గంగాపూర్, పోశిగాం, లక్ష్మీపూర్, తుంగెడ, మాద్వాయిగూడ, నంబాల, నారాయణపూర్, దర్మారం, రాజారం, నారాయణపూర్, కిష్టాపూర్, కొమురవెల్లి, జక్కులపెల్లి గ్రామాల ప్రజలు ప్రత్యామ్నాయ మార్గం చూసుకోవాలని అధికారులు సూచించారు.

వెనుకబడిన విద్యార్థులపై దృష్టి సారించాలి

బెజ్జూర్: చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని జీసీడీవో శకుంతల అన్నారు. సోమవారం బెజ్జూర్, కుంటలమానేపల్లి గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తరగతుల నిర్వహణ, ఉపాధ్యాయుల పనితీరుపై ఆరా తీశారు. కాసేపు విద్యార్థులతో సంభాషించారు. సిలబస్ పూర్తి చేయడం, ప్రత్యేక తరగతుల నిర్వహణ, స్టడీ అవర్స్, ప్రత్యేక మెనూ అందించడం, బోధనకు సంబంధించిన అంశాల గురించి అడిగి తెలుసుకున్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

- అదనపు కలెక్టర్ వేణు
- ప్రజావాణిలో అర్జీలు స్వీకరణ

ఆసిఫాబాద్: ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామని అదనపు కలెక్టర్ దాసరి వేణు అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా గిరివికాస్ పథకం కింద వేసిన బోరు బావులకు విద్యుత్ కనెక్షన్ ఇవ్వాలని వాంకిడి మండలం మర్కగూడకు చెందిన కోవ బాపూరావు, నవేధరికి చెందిన కొర్కెట సతలబాయి కోరారు. కులాంతర వివాహం చేసుకుని, ఇద్దరు పిల్లలతో అద్దె ఇంట్లో ఉంటున్న తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని ఆసిఫాబాద్ మండలం ఆర్ఆర్ కాలనీకి చెందిన పెందూర్ భువనేశ్వరి దరఖాస్తు చేసుకుంది. పదో తరగతి వరకు చదువుకున్న తనకు ఉపాధి చూపాలని రెబ్బెన మండలం కొండపెల్లికి చెందిన ఆదే భారతి విన్నవించింది. గోలేటి శివారులోని తన భూమి రికార్డులో నమోదు కాలేదని, సింగరేణి రీసర్వే చేయించాలని సోనాల గౌతం దరఖాస్తు చేసుకుంది. వృద్ధాప్య పింఛన్ మంజూరు చేయాలని కాగజ్‌నగర్ పట్టణంలోని బసంతి నగర్‌కు చెందిన మిత్ర సుబోద్ దరఖాస్తు చేసుకుంది. తన భర్త తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారుడిగా పని చేస్తూ అనారోగ్యంతో మృతి చెందాడని, తన కుమార్తె చదువు, పోషణకు ఉపాధి కల్పించాలని పెంచికల్‌పేట్ మండలం అగర్‌గూడకు చెందిన గోలేటి శారద వేడుకుంది. దహెగాం మండలం బీబ్రాకు చెందిన సుంకరి భీమయ్య.. తన తాతకు చెందిన భూములు ఇతరుల పేరుతో రికార్డు మార్పు జరిగిందని, ఈ తప్పిదాన్ని సవరించాలని దరఖాస్తు చేసుకున్నాడు. కాగజ్‌నగర్ పట్టణానికి చెందిన పోతరాజుల ప్రమీల.. తమకు భట్టుపల్లి శివారులో వారసత్వ భూమి ఉందని, పట్టా పాస్‌బుక్ మంజూరు చేయాలని కోరారు. రెబ్బెన మండలం గోలేటి శివారులోని ఇల్లు భూసేకరణలో పోతుందని, రీసర్వే చేయించి పునరావాసం, రీసెటిల్‌మెంట్, జీవనోపాధి కల్పించాలని గొర్లపెల్లి మాధవి కోరారు. కాగజ్‌నగర్ మండలం బుర్దగూడలో సర్వే నెం.64/1లోని భూమి ధరణిలో తప్పు రికార్డు నమోదైందని, సరిచేసి రైతుబంధు వచ్చేలా చేయాలని కొట్రంగి పోశెట్టి కోరాడు.


అర్జీలు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ వేణు

పింఛన్ బందయింది


చిన్నతనంలో రోడ్డు ప్రమాదంలో కాలి విరిగింది. గతంలో ఆసరా పింఛన్ వచ్చేది. నాలుగు సంవత్సరాలుగా బందయింది. ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నా. పింఛన్ వెంటనే పునరుద్ధరించాలి.

– వైరాగడే అమృత, వాంకిడి

పాస్‌బుక్ జారీ చేయాలి


కాగజ్‌నగర్ మండలం మెట్‌పల్లి శివారులో సర్వే నం.23/2(అ)లో 2.50 ఎకరాల భూమి కొన్నేళ్లుగా సాగు చేస్తున్నా. ప్రభుత్వం పట్టా ఇచ్చింది. ధరణిలో తమ్ముడి పేరుతో నమోదైంది. రికార్డు సరిచేయాలి.

– గావిత్రి ఇస్తారి, గ్రా.నందుప, ఆసిఫాబాద్

మత్స్య సహకార సంఘం రద్దు చేయాలి


'మేము ఆసిఫాబాద్ మండలం రౌటసంకెపెల్లి ఆర్ఆర్ కాలనీకి చెందిన పీవీటీజీ ఆదిమ గిరిజనులం. గ్రామానికి చెందిన కొందరు మాత్రమే సొసైటీ ఏర్పాటు చేసుకొని ఊట చెరువును స్వాధీనం చేసుకున్నారు. పెసా చట్టం నియమాలు ఉల్లంఘించారు. గ్రామ కార్యదర్శి, మత్స్యకార శాఖ జిల్లా అధికారి నిబంధనలకు విరుద్ధగా సొసైటీ ఏర్పాటు చేసి 90 కుటుంబాలకు అన్యాయం చేశారు. ప్రశ్నించిన వారిపై కేసులు పెడుతున్నారు. సొసైటీని రద్దు చేసి, గ్రామంలోని అందరికీ చెరువు ద్వారా ఉపాది కల్పించాలి' అని గ్రామానికి చెందిన గోగుల సుశీల, శ్రీనివాస్, ఆత్రం సత్యం, మడావి నగేశ్, టేకం మల్లయ్య, యాపల శంకర్ తదితరులు వినతిపత్రం సమర్పించారు.

అక్రమంగా పట్టా మార్చుకున్నారు


'మా తండ్రి కమ్మరి పోచయ్య పేరుతో ఇప్పలగూడెంలో సర్వే నెం.84లో 5.98 ఎకరాల పట్టా భూమి ఉంది. తండ్రి చనిపోవడంతో గతంలో మేమే సాగు చేశాం. 2022లో గ్రామానికి చెందిన వేరే వ్యక్తులు మా భూమిని అక్రమంగా పట్టా మార్చుకున్నారు. వారసులమైన మా పేరుతో పట్టా చేయాలి' అని కుమారుడు కమ్మరి ఇస్తారి, కుమార్తెలు రాంబాయి, సావిత్రి, మీరాబాయి, సుగుణ కోరారు.

వేసవిలో నీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలి


వీసీలో పాల్గొన్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

ఆసిఫాబాద్: వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలని పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా అన్నారు. ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా ప్రణాళికా బద్ధంగా నీటి సరఫరా చేయాలన్నారు. సోమవారం హైదరాబాద్ నుంచి ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల అదనపు కలెక్టర్లు, జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాల్లోని మారుమూల ప్రాంతాల ప్రజలకు సకాలంలో తాగునీరు అందేలా అధికారులు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. అదనపు కలెక్టర్ దీపక్ తివారి మాట్లాడుతూ జిల్లాలో ప్రజలకు తాగునీటి ఎద్దడి లేకుండా ప్రత్యేక ప్రణాళిక రూపొందించామని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్‌డీవో సురేందర్, మిషన్ భగీరథ ఈఈ వెంకటపతి, డీపీవో భిక్షపతి, కాగజ్‌నగర్ డీఎల్‌పీవో సురేందర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

అంత్యోదయ కార్డులు ఇవ్వాలని ధర్నా

కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ డివిజన్‌లోని దివ్యాంగులకు అంత్యోదయ రేషన్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఆర్డీవో కార్యాలయం ఎదుట వికలాంగుల హక్కుల జాతీయ వేదిక ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాజేశ్, ముంజం ఆనంద్‌కుమార్‌లు మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని ప్రతీ దివ్యాంగుడికి ప్రభుత్వం జారీ చేస్తున్న అంత్యోదయ కార్డులు తప్పకుండా ఇవ్వాలన్నారు. ఆర్డీవో కార్యాలయ ఏవో ప్రమోద్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. జాకీర్, సప్తగిరి, వెంకటేశ్, లక్ష్మి, ప్రమీల, అశోక్, యాదగిరి, రవీందర్, ఈశ్వరి, రాజు పాల్గొన్నారు.

కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన వెంకటేశ్ దోత్రే


మొక్క అందజేసి శుభాకాంక్షలు తెలుపుతున్న అదనపు కలెక్టర్ దాసరి వేణు


శుభాకాంక్షలు తెలుపుతున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

ఆసిఫాబాద్: పదోన్నతిపై కలెక్టర్‌గా వచ్చిన వెంకటేశ్ దోత్రే సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ చాంబర్‌లో పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, దాసరి వేణు, డీపీఆర్‌వో సంపత్ కుమార్‌లతో పాటు పలువురు జిల్లా అధికారులు కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా అభివృద్ధికి పాటు పడతానన్నారు.

భీం పోరాట స్ఫూర్తి ఆదర్శనీయం

కెరమెరి: ఆదివాసీల ఆరాధ్య దైవం, ఉద్యమ వీరుడు కుమురం భీం పోరాట స్ఫూర్తి ఆదర్శనీయమని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. అదనపు కలెక్టర్ దీపక్ తివారితో కలిసి సోమవారం జోడేఘాట్‌ను సందర్శించారు. భీం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి, సమాధి వద్ద పూజలు చేశారు. అనంతరం మ్యూజియాన్ని సందర్శించి ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. డీటీడబ్ల్యూవో రమాదేవి, తహసీల్దార్ దత్తు ప్రసాద్, ఎంపీడీవో కృష్ణారావు, ఎంపీవో అంజద్ పాషా, ఎంపీపీ పెందోర్ మోతీరాం, క్యూరెటర్ దందేరావు, గ్రామ పెద్ద రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

మార్లవాయి గ్రామాన్ని అభివృద్ధి చేస్తాం

జైనూర్: ఆదివాసీల ఆత్మబంధువు ప్రొఫెసర్ హైమన్‌డార్ఫ్ చరిత్ర గల మార్లవాయి గ్రామాన్ని అభివృద్ధి చేస్తామని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, అదనపు కలెక్టర్ దీపక్‌తివారీలు అన్నారు. సోమవారం మండలంలోని మార్లవాయి గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ప్రొ. హైమన్‌డార్ఫ్ - ఎలిజబెత్ దంపతుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పంచాయతీ కార్యదర్శి మనోజ్‌ను గ్రామ సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాజీ సర్పంచ్ కనక ప్రతిభ గ్రామంలోని పాత భవనాలకు మరమ్మతులు చేపట్టాలని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. డీటీడీవో రమాదేవి, ఎంపీడీవో ప్రభుదయ, డిప్యూటీ తహసీల్దార్ బీర్షావ్, ఆర్ఐ సుధాకర్ వాగ్మారే తదితరులు ఉన్నారు.


శుభాకాంక్షలు తెలుపుతున్న డీపీఆర్‌వో సంపత్‌కుమార్

ప్రజాపాలన సేవా కేంద్రాలు ప్రారంభం

దహెగాం: మండల కేంద్రంలోని స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ప్రజాపాలన సేవా కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో రాజేందర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన ఆరు గ్యారంటీల పథకాల్లో భాగంగా దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు ఏమైనా అభ్యంతరాలు ఉంటే సేవా కేంద్రంలో మరోసారి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆయన వెంట కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

తిర్యాణి: ప్రజాపాలనలో భాగంగా స్వీకరించిన దరఖాస్తుల్లో తప్పులను సవరించుకునేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు ఎంపీడీవో వేముల మల్లేశ్ పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశారు. దరఖాస్తు చేసుకునే సమయంలో తప్పుగా లేదా అసంపూర్తిగా వివరాలను అందజేసిన వారు అవకాశం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పెంచికల్‌పేట్: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ప్రజాపాలన ప్రత్యేక సేవా కేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. ఎంపీడీవో గంగాసింగ్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీలను పొందడానికి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజా పాలన దరఖాస్తులు నిరంతర ప్రక్రియ అని అర్హులైన ప్రతీ ఒక్కరు సేవా కేంద్రంలో సంప్రదించాలని సూచించారు. నూతనంగా వచ్చిన పలు దరఖాస్తులను పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు.

వాంకిడి: మండల కేంద్రంలోని ప్రజాపరిషత్ కార్యాలయంలో ప్రజాపాలన సేవా కేంద్రాన్ని సోమవారం ఎంపీపీ ముండె విమలబాయి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఇచ్చిన గడువులోగా ప్రజాపాలన దరఖాస్తులు ఇవ్వని తెల్లరేషన్ కార్డు కలిగిన వారు ఈ సేవా కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన రైతు భరోసా, మహాలక్ష్మి, గృహజ్యోతి పథకాలకు అర్హులైన వారు ప్రజాపాలన దరఖాస్తు ఫారాలు నింపి వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. ఎంపీడీవో వి.వి వరలక్ష్మి, ఎంపీవో ఖాజా జిజాజుద్దీన్, పాల్గొన్నారు.

కెరమెరి: ప్రజాపాలన సేవా కేంద్రాన్ని సోమవారం ఎంపీడీవో కృష్ణారావు, ఎంపీపీ పెందోర్ మోతీరాం ప్రారంభించారు. సమస్యల కోసం కార్యాలయానికి వచ్చిన దరఖాస్తులను ఆన్‌లైన్ చేయాలని పేర్కొన్నారు. తప్పుల సవరణ, అర్హులైన వారి పేర్లు జాబితాలో లేకపోతే సరిచేయడం, గృహజ్యోతిలో తప్పుల సవరణ, కొత్తవాటి నమోదు వంటి పనులు సేవా కేంద్రం చేస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో సిబ్బంది సుధాకర్, ప్రసాద్, రాజేశ్, జగన్నాథ్‌రావ, ధర్మూ ఉన్నారు.


కెరమెరి: ప్రజాపాలన సేవా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ


వాంకిడి: దరఖాస్తు స్వీకరిస్తున్న ఎంపీడీవో


పెంచికల్‌పేట్: దరఖాస్తు పరిశీలిస్తున్న ఎంపీడీవో


దహెగాం: ప్రారంభిస్తున్న ఎంపీడీవో రాజేందర్

చింతలమానెపల్లి: ప్రజాపాలన సేవా కేంద్రాన్ని మండలంలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో కోట ప్రసాద్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ప్రజాపాలన సేవా కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా పాలనలో భాగంగా పథకాలకు అర్హులైన వారు దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు.

వార్ధాపై వంతెన నిర్మించాలని ధర్నా

కౌటాల: గుండాయిపేట వద్ద వార్ధా నదిపై వెంటనే హైలెవల్ వంతెన నిర్మించాలని డిమాండ్ చేస్తూ సోమవారం మండల కేంద్రంలోని కుమురం భీం చౌరస్తాలో కౌటాల -బెజ్జూర్ ప్రధాన రహదారిపై బీఆర్ఎస్ నాయకులు ధర్నా చేశారు. బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు ఆదే వసంత్‌రావు మాట్లాడుతూ వార్ధా నదిపై వంతెన లేక నాటు పడవలతో ప్రయాణాలు చేస్తూ ప్రమాదాల బారిన పడి పలువురు మృత్యువాత పడ్డారని తెలిపారు. వంతెన నిర్మాణానికి గత ప్రభుత్వం రూ.75 కోట్ల నిధులు మంజూరు చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వంతెన నిర్మాణంలో జాప్యం చేయకూడదన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ పుష్పలతకు వినతిపత్రం అందించారు. పార్టీ మండల నాయకులు బండి శైలాజాగౌడ్, మధుకర్, గంగారం, నహీం, అశోక్, పత్రు, దాగం ఆగయ్య, శ్రీనివాస్, రమేశ్, లహంచు, ప్రభాకర్‌గౌడ్, బాపు, పున్నయ్య, తదితరులు పాల్గొన్నారు.


ధర్నా చేస్తున్న నాయకులు

మహిళలకు ఆటల పోటీలు

రెబ్బెన: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి టౌన్‌షిప్ బంగ్లాస్ ఏరియాలో లేడిస్ క్లబ్ మహిళలకు ఆటల పోటీలు నిర్వహించారు. సేవా సమితి ఏరియా ఉపాధ్యక్షురాలు నళిని నరేందర్ క్రీడా పోటీలను ప్రారంభించగా షాట్‌పుట్, బాల్ ఇన్ ద బాస్కెట్, త్రోబాల్ క్రీడా పోటీల్లో మహిళలు పాల్గొన్నారు. మహిళా దినోత్సవం రోజున విజేతలకు బహుమతులు ప్రదానం చేయనున్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

వాంకిడి: ఇబ్బందులను అధిగమించి మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారి భాస్కర్ అన్నారు. సోమవారం మండలంలోని ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాలను నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ కనకయ్య, మహిళా సాధికారత కేంద్రం, సఖీ కేంద్రం, ఐసీడీఎస్ అధికారులు పాల్గొన్నారు.

కనకదుర్గ ఆలయంలో 'మనసారే మనసారా'


కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

రెబ్బెన: మండలంలోని ఇందిరానగర్‌లో గల కనకదుర్గాదేవి, స్వయంభూ మహంకాళి ఆలయంలో ఆసిఫాబాద్ వనిత శక్తి ఆధ్వర్యంలో సోమవారం మనసారే మనసారా కార్యక్రమాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహిళలు అమ్మవారిని దర్శించుకొని మంగళహారతులు, లలిత సహస్ర నామాలు, కుంకుమ పూజలు చేశారు. పూలు, పండ్లు, పట్టువస్త్రాలు, ఒడిబియ్యం, నైవేద్యాలు సమర్పించి మొక్కులు సమర్పించుకున్నారు.

సంక్షిప్త వార్తలు

డీఎంగా విశ్వనాథ్ బదిలీ రద్దు చేయాలి

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపో మేనేజర్‌గా విశ్వనాథ్ బదిలీ రద్దు చేయాలని కోరుతూ ఆసిఫాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆమరాజుల శ్రీదేవి, ఎఫ్‌సీఐ సభ్యుడు పులుగం తిరుపతి సోమవారం ఆదిలాబాద్‌లో ఆర్టీసీ ఆర్ఎం సోలోమన్‌కు వినతిపత్రం సమర్పించారు. విశ్వనాథ్ గతంలో ఆసిఫాబాద్‌లో అసిస్టెంట్ డీఎంగా పని చేసిన సమయంలో కండక్టర్‌పై దాడి చేశాడన్నారు. ఆసిఫాబాద్ మండలానికి చెందిన విశ్వనాథ్ స్థానిక బలంతో కార్మికులను వేధింపులకు గురి చేసే అవకాశం ఉందని, దీంతో కార్మికులు ఆందోళనకు గురవుతున్నారన్నారు. విశ్వనాథ్ పోస్టింగ్ రద్దు చేయాలని కోరారు. వారి వెంట బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కేశవ రెడ్డి, గోవర్ధన్ రెడ్డి ఉన్నారు.

రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ

కాగజ్‌నగర్‌రూరల్: హైదరాబాద్‌లోని కోట్ల విజయ భాస్కర్ రెడ్డి ఇండోర్ స్టేడియంలో తెలంగాణ స్పోర్ట్స్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 9వ రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో కాగజ్‌నగర్ విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. కుమిటె (ఫైట్) విభాగంలో బిందుషా ప్రథమ స్థానం, త్రినాథ్, అశ్విత్, రితీష్‌లు ద్వితీయస్థానం, జిశాన్, నవనీత్, సాత్విక్, వివేక్‌తేజ తృతీయ స్థానాలను కైవసం చేసుకున్నారు. వీరిని తెలంగాణ స్పోర్ట్స్ కరాటే అసోసియేషన్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్ గౌడ్, కోశాధికారి రామస్వామి, జిల్లా అధ్యక్షుడు రవీందర్, ప్రధాన కార్యదర్శి, కరాటే మాస్టర్ దేవయ్య, మాస్టర్ రవి, ఫాతిమాకాన్వెంట్, సెంట్ క్లారిటీ ప్రిన్సిపాళ్లు, సిబ్బంది అభినందించారు.

సమాచార నైపుణ్యాలపై శిక్షణ

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని విద్యార్థులకు సోమవారం సమాచార నైపుణ్యాలపై శిక్షణ తరగతులు ప్రారంభించారు. తెలంగాణ నైపుణ్య అకాడమీ (టాస్క్) ఆధ్వర్యంలో సోమవారం నుంచి మూడు రోజులపాటు విద్యార్థులకు శిక్షణ ఇవ్వనున్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డి.లక్ష్మినరసింహం మాట్లాడుతూ విద్యార్థులు డిగ్రీ స్థాయిలోనే వివిధ అంశాలలో నైపుణ్యాలను సాధించాలన్నారు. వైస్ ప్రిన్సిపాల్ సీహెచ్ రాజు, టాస్క్ కోఆర్డినేటర్ దత్తాత్రేయ, శిక్షణా నిపుణులు సాయి కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

సభకు తరలిన బీజేపీ నాయకులు

జైనూర్: దేశ ప్రధాని నరేంద్ర మోదీ సభకు మండలంలోని ఆయా గ్రామాల నుంచి ప్రజలు, బీజేపీ నాయకులు సోమవారం భారీగా తరలివెళ్లారు. బీజేపీ జిల్లా నాయకుడు సుభోధ్‌కాంత్, నాగ్‌నాథ్, సూర్యకాంత్, రామేశ్వర్, రాజేశ్వర్, శంకర్, నగేష్, తదితరులు ఉన్నారు.

రెండోరోజూ 'పల్స్‌పోలియో'

ఆసిఫాబాద్: జిల్లాలో పల్స్‌పోలియో కార్యక్రమం రెండోరోజు కొనసాగింది. సోమవారం జిల్లా వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో గడపగడపకూ వెళ్లి చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. జిల్లావ్యాప్తంగా 1,36,712 గృహాల్లో 1,21,241 గృహాలను సందర్శించి, 3,768 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేసినట్లు డీఎంహెచ్‌వో తుకారాం తెలిపారు. ఇప్పటివరకు 99.3 శాతం పోలియో చుక్కలు వేయడం పూర్తయిందని పేర్కొన్నారు.

దహెగాంలో..

దహెగాం: పల్స్‌పోలియో కార్యక్రమం రెండోరోజు మండలంలో కొనసాగిందని వైద్యాధికారిణి స్పందన పేర్కొన్నారు. సోమవారం కార్యక్రమాన్ని పరిశీలించారు. వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.